# కథావేదిక


**మంచి కథల్ని మళ్ళీ మళ్ళీ చదువుకోవడం కోసం కథలన్నింటినీ ఒకే గుత్తిగా అందిస్తున్నాం**

ఈమధ్యనే ఎమ్‌కాం పాసయ్యాడు అంకబాబు. ఇక సరస్వతీదేవి ఆరాధనకు స్వస్తిచెప్పి లక్ష్మీకటాక్షం కోసం ఉద్యోగాల వేటలో పడ్డాడు. ఎన్నో వాంటెడ్ కాలమ్స్ తిరగేసి, ఇంటర్వ్యూలకు హాజరైన అంకబాబుకి ఎట్టకేలకు తిక్కశంకరయ్య అండ్ సన్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌లో అక్కౌంటెంట్‌గా ఉద్యోగం వచ్చింది. కంపెనీ పేరేదైతేనేం ఉద్యోగం వచ్చింది. అదే పదివేలు అనుకుంటూ ఓ మంచిరోజు చూసి అందులో చేరిపోయాడు.

వరుసగా నాలుగురోజులు గడిచాయి. 'హమ్మయ్య ఈ రోజు గడిస్తే రేపు ఆదివారం' అని తృప్తిగా నిట్టూర్చాడు.

## ఆదివారం సెలవు కావాలి

-యం.యర్.జయప్రద




**ఆంధ్రభూమి దినపత్రిక ఉగాది కథల పోటీలో ఎంపికైన కథ**

చిన్నప్పటినుంచీ అంకబాబుకి ఆదివారం అంటే మహా ఇష్టం. ఆదివారం కోసం శనివారం వరకు రోజులు లెక్కపెట్టేవాడు. ఆదివారం వస్తే హాయిగా ఎంతోసేపు పడుకోవచ్చు అనుకునే అంకబాబుని తెల్లారి ఆరింటికే అమ్మ నిద్ర లేపేసేది. మరి కాసేపు పడుకుంటానంటే 'చదువుకునే వాళ్లు అలా ఎక్కువ సేపు పడుకుంటే బద్ధకం పెరిగిపోయి చదివింది మర్చిపోతార్రా బడుద్దాయ్' అని నాన్నగారు కేకలేసేవారు.

"అన్నయ్య పదిగంటలు దాటినా నిద్ర లేవడు. మరి అన్నయ్యని ఏం అనరేం?" అని రోషంగా అడిగేవాడు.

"నువ్వు కూడా అన్నయ్యలా బాగా చదువుకుని మంచి ఉద్యోగంలో చేరిన తరువాత అంతసేపు నిద్రపోదువుగానీ. ఇక లే కాఫీ ఇస్తాను" అనేది అమ్మ.

ఆదివారం వస్తే ఎంచక్కా ఉదయం తొమ్మిదింటిదాకా ముసుగుతన్ని పడుకోవచ్చు. మధ్యాహ్నం భోజనం చేసి మళ్లీ ఓ కునుకు తీసి సాయంత్రం అలా జాలీగా ఫ్రెండ్స్‌తో ఫస్ట్‌షోకెళ్లవచ్చు అనుకుంటూ తీయని ఊహలలో తేలిపోతున్న అంకబాబుని "సార్! మేనేజరుగారు పిలుస్తున్నారు" అంటూ తట్టిలేపాడు ఆఫీసు బాయ్.

మేనేజర్‌గారి ఛాంబర్లోకి ప్రవేశించి "సార్" అని పలకరించిన అంకబాబుని చూసాడు మేనేజరుగారు.

"చూడవోయ్ అంకబాబూ! త్వరలో హెడ్డాఫీసు ఇనస్పెక్షన్ జరగబోతోంది. ఈలోగా పెండింగ్‌లో ఉన్న ఫైల్స్ అన్నీ క్లియర్ చేసేయాలి. రేపు ఉదయం ఎనిమిదింటికల్లా ఆఫీసుకొచ్చేయ్" అన్నారు మేనేజర్‌గారు.

"కానీ రేపు సండే కద్సార్" అని నసుగుతున్న అంకబాబు వైపు కోపంగా చూసాడు.

"అయితే...ఏమిటి? ఆదివారం పని చేయకూడదని ఎక్కడైనా రూలుందా? అయినా దేశంలో ఎన్ని ఆఫీసులు ఆదివారంనాడు పనిచేయడం లేదూ. రేపు ఉదయం తప్పకుండా వచ్చి తీరాల్సిందే. ఇక నువ్వెళ్లొచ్చు" అనేసి ఫైలు చూడడంలో మునిగిపోయాడు.

గాలి తీసేసిన బెలూన్లా అయిపోయి ఉస్సూరంటూ వచ్చి సీట్లో కూలబడ్డాడు.

'హూ...ఉద్యోగంలో చేరిన తొలి ఆదివారం నాడు ఆఫీసుకు రావాల్సి వస్తోంది. ఏం చేస్తాం? కొత్తగా చేరిన ఉద్యోగం. ఆదివారాలు, సెలవులూ అనుకుంటే ఎలా? ఈ ఆదివారం కాకపోతే పై ఆదివారం సెలవు తీసుకుంటాను' అని రాజీపడ్డాడు.

***

మరునటిరోజు ఉదయం ఏడుగంటలకల్లా తయారై ఆఫీసుకు బయల్దేరబోతున్న అంకబాబుని "ఏమోయ్ అంకబాబూ! ఎలా ఉంది కొత్త ఉద్యోగం? ఆదివారం కూడా వెళ్లాలా?" అంటూ పలకరించారు పక్కింటి పుల్లయ్యగారు.

"అవునండీ... అర్జంట్ వర్క్ వుంది" అని సమాధానం చెప్పి ముందుకు సాగిపోయాడు.

ఆఫీసులో పని ముగించుకుని బయటపడేసరికి మధ్యాహ్నం రెండుగంటలైంది. ఇంటికి వచ్చి భోజనం చేసి పడుకుందాం అనుకునేసరికి నాలుగు దాటింది.

"ఈవేళప్పుడు నిద్రేమిట్రా? పైగా ఇంటికి దరిద్రం కూడాను. లే లే రాత్రి పెందరాళే నిద్రపోదువుగానీ" అని అమ్మ లేపేసింది.

"హూ...ఆదివారం కూడా కాసేపు నడుం వాల్చనివ్వవుకదా" అని విసుక్కుంటూ లేచాడు అంకబాబు.

ఉద్యోగంలో చేరిన తొలి ఆదివారం అలా విసుగ్గా గడిచిపోయింది. సోమవారం నిరుత్సాహంగా గడిపాడు.

మంగళవారం మామూలుగా గడిచింది. బుధవారం అలవాటుపడ్డాడు. గురువారం స్థిమితపడ్డాడు. శుక్రవారం ఏదో మూల కాస్త ఆశ. శనివారం మళ్లీ ఉత్సాహం.

అయితే ఆ ఉత్సాహం ఎక్కువసేపు నిలువలేదు. సాయంత్రం నాలుగుగంటలు కావొస్తుండగా మేనేజరు రూంలోంచి వచ్చిన పక్కసీటు జోగారావు అంకబాబుతో "ఏమండీ! మనం రేపు ఉదయం తొమ్మిదింటికల్లా బ్రాంచీ ఆఫీసుకు వెళ్లాలి. అక్కడ పని బాగా పేరుకుపోయిందిట. ఉదయం వెళ్లి సాయంత్రానికి పూర్తిచేసి రావాలి" అన్నాడు.


లాగి గూబమీద ఒక్కటిచ్చుకుందామన్నంత కోపం వచ్చింది అంకబాబుకి. అయినా తమాయించుకుని "అదేమిటీ ఆదివారాలు సెలవులుండవా ఈ ఆఫీసులో" అసహనంగా అడిగాడు.

"అదేం అలా అడిగారు? ఫైనాన్షియల్ ఇయర్ దగ్గర పడుతోంది కదా. అందుకని ఓ రెండుమూడునెలలు ఆదివారాలు కూడా రావాల్సి వుంటుంది"



## డిమాండ్!

'ఢీ' చిత్రం సూపర్ హిట్ కావడంతో జెనీలియా డిమాండ్ బాగా పెరిగిందంటున్నారు. అంతకు ముందు 'బొమ్మరిల్లు' సినిమా ఘన విజయం సాధించింది. ఇక ఆమె రాబోయే సినిమా 'మిస్టర్ మేధావి' గనక హిట్టయితే వరుసగా మూడు హిట్ చిత్రాల్లో నటించి హ్యాట్రిక్ సాధించినట్టవుతుంది. ప్రస్తుతం 35 లక్షల వరకూ తీసుకుంటున్న జెనీలియా మూడవ చిత్రం కూడా హిట్ అయితే తన పారితోషికాన్ని 50 లక్షల వరకూ పెంచేసినా ఆశ్చర్యం లేదు అంటున్నారు సినీజనాలు.



అన్నాడు జోగారావు తాపీగా.

"మరి ఆదివారాలు సెలవులు మురిగిపోతున్నాయిగా" బాధగా అన్నాడు.

"దానికి ప్రతినెలా ఓ రెండువందలు కాంపెన్సేషన్ పే చేస్తారు" చెప్పాడు జోగారావు.

"బోడి కాంపెన్సేషన్ ఎవడిక్కావాలి. నాకు మాత్రం ఆదివారం సెలవు కావాల్సిందే" అన్నాడు అంకబాబు మొండిగా.

"అలా అనుకుంటే ఎలా అంకబాబుగారూ! మీరీ ఉద్యోగంలో కొత్తగా చేరారు. బాగా పని చేసి మంచి పేరు తెచ్చుకోవాలి. మరి వస్తారుగా" అన్నాడు జోగారావు.

'రాక ఛస్తానా?' అని మనసులో అనుకుని పైకి మాత్రం "ఉద్యోగం అన్నాక తప్పదుగా వస్తాలెండి" నీరసంగా జవాబిచ్చాడు.

***

మర్నాడు కూడా ఉదయం ఎనిమిదింటికి బయల్దేరుతుంటే "ఈ ఆదివారం కూడా వెళ్లాలా అంకబాబూ? పాపం మీకు ఆదివారాలు సెలవు ఉండవనుకుంటా?" సానుభూతి కనబరిచాడు పుల్లయ్యగారు.

అంతే! ఒక్కసారిగా పుండుమీద కారం చల్లినట్టయింది అంకబాబుకి. మొగుడు కొట్టినందుక్కాదు, తోడికోడలు నవ్వినందుకే నా ఏడుపు అన్నట్లు "ఏం చేస్తాం? మా ఉద్యోగాలు అలాంటివి. అందరికీ మీ అంతటి మంచి ఉద్యోగం వస్తుందా?" కోపంగా అనేసి సైకిలెక్కి బయల్దేరాడు.

ఆరోజు కూడా పని ముగించుకుని ఇంటికి చేరేసరికి మూడైంది. ఈ ఆదివారం కూడా ఇలా పోయినందుకు తల్లడిల్లిపోయాడు. ఇక ఏమైనా ఆదివారం సెలవు దొరికే మరో ఉద్యోగం చూసుకోవాల్సిందే. ఇలా సెలవులు లేకుండా ఉద్యోగం చేయడం తనవల్ల కాదనుకున్నాడు.

సోమవారం మళ్లీ షరా మామూలే. మిగతా రోజులన్నీ యధాతథంగా గడిచిపోయి శనివారం వచ్చింది. అయినా ఏమంత ఉత్సాహంగా లేదు అంకబాబుకి. మళ్లీ ఈ ఆదివారం కూడా ఏదో ఒక పని తగలడక ఛావదు విరక్తిగా అనుకున్నాడు. పైన తథాస్తు దేవతల ప్రభావమో, లేక అంకబాబుకున్న సిక్స్త్ సెన్స్ ఫలితమో మరి... సాయంత్రం అయిదు కావస్తుండగా ఆఫీస్ బోయ్ ఏదో ఓ కాగితం తీసుకువచ్చాడు అంకబాబు దగ్గరకు.

'రేపు ఉదయం ఏడుగంటల ట్రైన్‌కి హెడ్డాఫీసు నుండి ఫైనాన్స్ మేనేజర్ గారు వస్తున్నారు. జోగారావుతో కలసి ఆయన్ని స్టేషన్‌లో రిసీవ్ చేసుకుని ఆఫీసుకు తీసుకురావాల్సిందిగా' దాంట్లో రాసి ఉంది.

'హూఁ...అనుకున్నదంతా అయింది. ఈ ఆదివారం కూడా డ్యూటీ తప్పలేదు' అంకబాబు బాధ తట్టుకోలేక బావురుమన్నాడు. కాస్సేపటికి ఎలాగోలా తేరుకున్న అంకబాబు అతికష్టమ్మీద మనసు దిటవు చేసుకుని ఆ కాగితం మ్మీద ఓ సంతకం గీకేసి బాయ్ చేతికిచ్చాడు.

'ఇక లాభంలేదు తనిక ఈ ఉద్యోగం చేయలేడు. ఏదేమైనా మరో ఉద్యోగం చూసుకోకపోతే త్వరలో పిచ్చి పట్టి పిచ్చాసుపత్రిలో చేరడం ఖాయం' అనుకున్నాడు.

***

ఏమైతేనేం...మర్నాడు ఉదయం ఆరింటికే ఏడుస్తూ లేచి తయారై పక్కింటి పుల్లారావుగారి కంటపడకుండా తప్పించుకుని ఏడింటికల్లా జోగారావుతో కలిసి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. తీరా స్టేషన్‌కు వెళ్లాక 'నువ్వు ఎక్కవలసిన అవసరంలేని రైలు కూడా ఓ గంట లేటు' అన్న చావు కబురులాంటి అనౌన్స్‌మెంట్ వినిపించింది. ఉస్సూరంటూ జోగారావుతో కలసి ప్లాట్‌ఫారం మీద ఓ బెంచీపై కూలబడ్డాడు.

ఓ గంట దిగులుగా గడిచాక వీళ్లు ఎదురు చూస్తున్న రైలు సుమారు నూట ఇరవై నిముషాలు ఆలస్యం అన్న అనౌన్స్‌మెంట్ మరోసారి వినిపించింది. 'ఛీ...వెధవ బతుకు. ఏ జన్మలో చేసుకున్న పాపమో! ఇప్పుడు అనుభవిస్తున్నాను' అని నీరసంగా కృంగిపోతున్న అంకబాబుని చూస్తూ-

"ఉద్యోగం అన్నాక ఏవో కష్టాలుంటాయండీ. దానికే దిగులు పడితే ఎలా? అసలు ఏ ఉద్యోగంలేని నిరుద్యోగుల పరిస్థితి ఇంకెంత దారుణంగా ఉంటుందో ఆలోచించండి" అన్నాడు జోగారావు ఓదార్పుగా.

"అవున్లెండి పీత కష్టాలు పీతవి" అన్నాడు అంకబాబు కసిగా.

"పదండి అలా వెళ్లి ఓ టీ తాగి వద్దాం. మనసు కాస్త కుదుటపడుతుంది" అన్న జోగారావుని నీరసంగా అనుసరించాడు.

టీ తాగడం పూర్తి చేసి స్టేషన్ చేరుకున్నాక స్టేషన్ మాస్టర్ దగ్గరకు వెళ్లి ట్రైన్ ఇంకా ఎంతసేపట్లో వస్తుంది' అడిగాడు అంకబాబు.

"పొద్దున్నే ఓ గూడ్సు రైలు పట్టాలు తప్పిందండీ. అదంతా సరిచేసి రూట్ క్లియర్ చేసారు. ఆ ట్రైన్ ఇప్పుడే బయల్దేరింది. ఇంకో గంటలో రావచ్చు" అని తాపీగా సమాధానం ఇచ్చారు సదరు స్టేషన్ మాస్టారు.

## మృత్యుంజయుడు

2002 సంవత్సరంలో కారు ప్రమాదంలో జామీవారెన్ అనే అతను తీవ్రంగా గాయపడ్డాడు. తుక్కుతుక్కయిన కారు మంటల్లో మండిపోతుంటే కారు అద్దాలను పగులగొట్టి మంటల్లోంచి అతన్ని రక్షించి హాస్పిటల్‌లో చేర్చారు. అతనికి తగిలిన ప్రాణాంతకమైన గాయాల్ని చూసి అతను 24 గంటలకన్నా ఎక్కువ బ్రతకడని అన్నారు డాక్టర్లు. తరువాత మూడువారాలపాటు కోమాలో ఉండిపోయిన అతను ప్రాణ రక్షణ కోసం ఐసియులోని కృత్రిమ సాధనాల ధర్మమా అని తిరిగి స్పృహలోకి వచ్చాడు. నాలుగేళ్లపాటు 7.5 లక్షల పౌండ్ల ఖర్చుతో 32 రకాల ఆపరేషన్ల తరువాత అతను మళ్లీ తన కాళ్లమీద తాను నిలబడగలిగాడు. డాక్టర్లు చేసింది నిజంగా మిరకిల్ అని వారెన్ అంటుంటే, డాక్టర్లు మాత్రం అతను నిస్సందేహంగా మృత్యుంజయుడు అని అంటున్నారు. ఏది ఏమైనా నాలుగేళ్ల తరువాత వారెన్ ఇటీవల క్రిస్మస్ పండుగను వైభవంగా జరుపుకున్నాడు.

## చెత్త నుంచి మణులు

తైవాన్‌లో 2006లో 21.6 లక్షల టన్నుల చెత్తని రీసైకిల్ చేస్తే 163 కోట్ల డాలర్ల విలువైన క్లీనింగ్ ఖర్చు ఆదా అయిందిట. సించూ నగరంలో రీసైకిల్ చేసిన బాటిల్స్ నుంచి తయారైన గాజురాళ్లు నీలమణుల్లా ప్రకాశిస్తూ పలువురిని ఆకర్షిస్తున్నాయి.

-తటవర్తి




"హూ...అంతా నా ఖర్మ. మన రైళ్లు ఏనాడూ సమయానికి వచ్చి చచ్చాయి కనుక" విసుక్కుంటూ "ఆ ట్రైన్ ఇప్పుడే బయల్దేరిందిట. ఇంకో గంటకుగానీ రాదన్నారు స్టేషన్ మాస్టారు" అని జోగారావు పక్కన కూలబడ్డాడు.

మరో గంటన్నర కావొస్తుండగా 'తప్పంతా అక్కడ పట్టాలు తప్పిన గూడ్సు బండిదేగానీ నాదేం కాదు సుమా' అన్న సంజాయిషీ ఇచ్చుకుంటున్నట్లు నిదానంగా వచ్చి స్టేషన్‌లో ఆగింది వీరు ఎదురు చూస్తున్న రైలు.


ఫైనాన్స్ మేనేజర్‌గారిని రిసీవ్ చేసుకుని ఆఫీసుకు తీసుకెళ్లి సకల మర్యాదలూ పూర్తి చేసి బయటపడేసరికి మధ్యాహ్నం మూడు దాటింది.

రోడ్డుమీద ఏవో చిన్నాచితకా వ్యాపారాలు చేసుకునేవారు మినహా దాదాపు అన్ని షాపులూ కట్టేసి అంతా నిర్మానుష్యంగా ఉంది. చివరకు రోడ్డు పక్కన టెంట్ వేసుకుని చెప్పులు కుట్టేవాడు, తాళాలు బాగు చేసే వాళ్లు కూడా కనబడలేదు.



## అట్రాక్షన్

ఆర్తీ అగర్వాల్ తన కెరీర్ సెకండ్ ఇన్నింగ్స్ ఆరంభించి, సునీల్ సరసన అందాల రాముడులో నటించింది. త్వరలో తరుణ్‌తోనూ కలిసి నటించే అవకాశాలున్నాయంటున్నారు. ఆకాష్-తరుణ్ హీరోలుగా నిర్మాణం కానున్న 'నవవసంతం'లో ముగ్గురు హీరోయిన్లుంటారట. ప్రియమణి, ఛార్మిలు ఇప్పటికే ఎన్నిక కాగా మూడో హీరోయిన్‌గా ఆర్తీ అగర్వాల్‌ని తీసుకోవాలని నిర్మాతలు అనుకుంటున్నట్లు వినికిడి. ఇదే జరిగితే ఈ సినిమాకి ఇదో అట్రాక్షన్ అవుతుంది.




'వీళ్లంతా ఎంతో అదృష్టవంతులు. వారంలో ఆరురోజులూ కష్టపడినా ఏడో రోజు హాయిగా రెస్టు తీసుకుంటారు. నా కర్మ ఇలా కాలి గానుగెద్దులా తయారైంది జీవితం' అంటూ నిట్టూర్చాడు.

***

మళ్లీ మరుసటివారంలో రెండురోజులు గడిచాయి. మూడోరోజు మేనేజరు గారు స్టాఫ్‌నంతా పిలిచి "ఈనెల ఇరవై ఆరోతారీఖు ఉదయం పదకొండుగంటలకు మా అబ్బాయి పెళ్లి ఈ ప్రక్క ఊళ్లోనే. మీరంతా తప్పకుండా రావాలి. మీకోసం ప్రత్యేకంగా బస్సు కూడా వేసాను. అంతేకాదు, మీ అందరికీ కాఫీ ఫలహారాలు కూడా మా ఇంట్లోనే. ఏడింటికల్లా మీరు వచ్చి కాఫీ టిఫిన్లు కానిచ్చి ఎనిమిదింటికల్లా బయలుదేరితే పదింటికల్లా అక్కడికి చేరుకోవచ్చు" అని అందరికీ పేరుపేరునా చెప్పారు.

ఇది విన్న అంకబాబు కంగారుపడుతూ ఒక్కసారి కేలండర్‌వంక చూసి గతుక్కుమన్నాడు. ఆ రోజు ఆదివారం. కనీసం ఈ ఆదివారమైనా పెళ్లికి ఎగ్గొట్టి సెలవు తీసుకోవడానికి కుదురుతుందేమోనని ఆశతో-

"జోగారావుగారూ! ఒకవేళ పెళ్లికి రావడానికి కుదరకపోతే మరేం కాదు కదా" అనుమానంగా.

ఇది విన్న జోగారావు ఉలిక్కిపడ్డాడు.

"కొంపదీసి పెళ్లికి రావడం మానేస్తారా ఏమిటి? అలాంటి పిచ్చిపనులేం చేయకండి. మన మేనేజరు అసలే ఛండశాసనుడు. ఎవరైనా రాకపోతే తనమీద వారికి బొత్తిగా గౌరవం లేదని భావించి ఇక ప్రతిరోజూ నరకం చూపెడతాడు" అన్నాడు.

"అలాగా" అంటూ నీరసించిపోయాడు. ఛ్! ఇక ఏదేమైనా సరే వచ్చేనెలలో మరో ఉద్యోగం వెతుక్కోవాల్సిందే. ఇక ఇక్కడే ఉంటే ఆదివారం కాదు కదా ఏడాదికొక్కరోజు కూడా సెలవు దొరకదు అన్న నిర్ధారణకు వచ్చేసాడు అంకబాబు.

***

ఒక ప్రముఖ దినపత్రికలో సబ్-ఎడిటర్ పోస్టుకి కాల్‌లెటర్ వస్తే ఒంట్లో బాగోలేదని చెప్పి మధ్యాహ్నం పర్మిషన్ తీసుకుని ఆ ఇంటర్వ్యూకి వెళ్లాడు అంకబాబు. అక్కడ పని చేస్తున్న కొంతమంది స్టాఫ్‌ని పరిచయం చేసుకుని వర్కింగ్ టైమింగ్స్ తెలుసుకుని తృప్తిపడ్డాడు.

అయితే ఒక విషయం గ్రహించి ఉస్సూరుమన్నాడు. అదేమిటంటే అక్కడ పనిచేసే సిబ్బంది అంతా వారంలో ఏదో ఒకరోజు వీక్లీ ఆఫ్ తీసుకుంటారట. ఆదివారంనాడు కేవలం ఎగ్జిక్యూటివ్ స్టాఫ్‌కే వీక్లీ ఆఫ్ అని.

'పోన్లే ఇక్కడ కొంత నయం. వారంలో ఏదో ఒకరోజు సెలవు అంటూ ఉంది. అక్కడైతే నెలంతా పని దినాలే. ఇక్కడ ఉద్యోగం వస్తే బావుణ్ను' అని కోరుకున్న అంకబాబుకి సబ్-ఎడిటర్‌గా అవకాశం వచ్చింది.

ఉద్యోగంలో చేరిన రెండోరోజునే పర్సనల్ ఆఫీసు నుండి అపాయింట్‌మెంట్ ఆర్డర్ అందింది. అందులో ఆరునెలలపాటు ట్రైనింగ్ పీరియడ్. ఆ తరువాత మరో ఆరునెలలు ప్రొబేషన్‌లో ఉంచుతాము. ట్రైనింగ్ పీరియడ్‌లో సెలవులు, వీక్లీఆఫ్‌లు ఉండవు. ఇది చదివి అంకబాబు మరింత కృంగిపోయాడు.

ఇక తన జీవితంలో సెలవు అన్నమాటకు అర్థం లేదనుకున్నాడు. గత్యంతరంలేక రాజీపడి మనసు రాయి చేసుకుని రోజులు నెట్టుకొస్తున్నాడు అంకబాబు. అయినా ఓరోజు ఉండబట్టలేక "ఛీ...వెధవ బ్రతుకు. ఓ సెలవూలేదు, సరదా లేదు. గాడిద చాకిరీ తప్ప" అంటూ తన కొలీగ్ భానుమూర్తి దగ్గర బావురుమన్నాడు.

"అలా నిరుత్సాహపడితే ఎలాగండీ అంకబాబుగారూ! ఎంతో అదృష్టం చేసుకుంటేనో పత్రికా రంగంలో జర్నలిస్టుగా అవకాశం వస్తుంది" అని ఓదార్చబోయాడు.

"అది నిజమేననుకోండి. రోజూ ఎన్నో సెన్సేషనల్ న్యూస్ అందించే పత్రికా రంగంలో ఈ షిఫ్ట్ డ్యూటీలు, వారానికోసారి డెస్క్ మారడం బాగానే ఉంది. అయితే ఇలా బొత్తిగా సెలవు లేకుండా పనిచేయాలంటే బోరు కొట్టదూ" అమాయకంగా అడిగాడు.

"అలవాటయితే ఈ ఉద్యోగం ఎంతో థ్రిల్లింగ్‌గా ఉంటుంది. నా మటుకు నాకైతే వీక్లీ ఆఫ్ వచ్చిందంటే ఒకటే బోరు. మర్నాడు డ్యూటీకొచ్చేవరకూ మన శ్శాంతి ఉండదంటే నమ్మండి. అయినా సెలవు తీసుకుని ఇంటిదగ్గరేం చేస్తాం...గోళ్లు గిల్లుకోవడంతప్ప" అన్నాడు భానుమూర్తి.

"బ్రహ్మచారులకైతే ఈ ఉద్యోగం చాలా బావుంటుంది. రేపు పెళ్లయితే ఇలా సెలవులూ గట్రా లేకుండా పొద్దస్తమానం డ్యూటీ అంటే ఆ వచ్చేవాళ్లకి కూడా విరక్తి కలిగి వీడ్నెందుకు చేసుకున్నాంరా బాబూ అని తల బాదుకుంటారు" అన్నాడు అంకబాబు.

"అబ్బే...అలా ఏం ఉండదండీ. మీకో విషయం చెప్పనా? నా పెళ్లికి వీక్లీ ఆఫ్ పోను కేవలం రెండురోజులు మాత్రమే సెలవు పెట్టాను. మన ఎగ్జిక్యూటివ్ స్టాఫంతా డ్యూటీపట్ల నాకున్న సిన్సియారిటీని తెగ మెచ్చుకున్నారు" అన్నాడు.

"ఏమో బాబూ...కనీసం వారానికోసారైనా సెలవులేందే పనిచేయడం కష్టం" అన్నాడు అంకబాబు.

"అలా అనుకోకండి. సంఘంలో ఎంతో గుర్తింపు, క్రేజు వున్న ఈ ఉద్యోగం చేయాలంటే పెట్టి పుట్టాలి. మావారు ఫలానా పత్రికలో జర్నలిస్టు, వారికి సెలవు దొరకడం చాలా కష్టం అని మా ఆవిడ చుట్టుపక్కలవారితో అంటూంటే ఎంతో గర్వంగా ఉంటుంది" అన్నాడు భానుమూర్తి.

ఏది ఏమైనా సెలవులు లేకుండా ఓ ఆరునెలలు పనిచేయాలంటే విలవిలలాడిపోతున్నాడు అంకబాబు. 'వారానికో సెలవైనా దొరికే మరో ఉద్యోగం చూసుకోవాల్సిందే' అనుకున్నాడు.

***

ఎన్నో ప్రయత్నాలు చేసిన మీదట ఓ కార్పొరేట్ కాలేజీలో కామర్స్ లెక్చరర్‌గా అవకాశం వచ్చింది అంకబాబుకి. హమ్మయ్య టీచింగ్ జాబ్ అంటే సెలవులూ అవీ బానే ఉంటాయనుకున్నాడు.

రేపు ఆదివారం జరగబోయే వారాంతపు పరీక్షలకి ఉదయం, మధ్యాహ్నం రెండుపూటలా ఇన్విజిలేటర్‌గా అంకబాబుకి కూడా డ్యూటీ వేసారు ప్రిన్సిపాల్ గారు. కార్పొరేట్ కళాశాలలు ఆదివారాలు కూడా పనిచేస్తాయని విన్నాడుగానీ అయితే ఆదివారంనాడు కేవలం ఒక్క నాన్ టీచింగ్ స్టాఫ్ వాళ్లే ఉదయం వచ్చి మధ్యాహ్నంవరకు ఒక పూట ఉండి మధ్యాహ్నం సెలవు తీసుకుంటారనుకున్నాడు కానీ టీచింగ్ స్టాఫ్ కూడా రాక తప్పదని గ్రహించి భోరుమన్నాడు.

'పెనంమీద నుంచి పొయ్యిలోకి పడ్డాను. ఇక నా జీవితంలో ఆదివారాలు లేవు... అన్నీ పనివారాలే' అని వాపోయాడు.

రోజూ అయిదారు గంటలు రెగ్యులర్ క్లాసులు, వారాంతంలో ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు, ఖాళీ ఉన్న సమయాలలో పరీక్ష పేపర్ల వాల్యుయేషన్‌తో బొత్తిగా విశ్రాంతిలేక విలవిల్లాడిపోతున్నాడు. 'భగవంతుడా! ఈ జన్మకు కనీసం ఒక్క ఆదివారంనాడైనా సెలవు ఇప్పించు. నీ దయవల్ల ఏదో ఒక ఆదివారం నాడు సెలవు దొరికితే నీ కొండకు నడిచి వచ్చి తలనీలాలు అర్పించుకుంటాను' అని తిరుపతి వెంకన్నకు మొక్కుకున్నాడు.

ఆ తిరుపతి వేంకటేశ్వరునికి అంకబాబు మొర వినిపించింది కాబోలు ఓ రోజు క్లాసులో పాఠం చెబుతుండగా అటెండర్ వచ్చి ఓ నోటీసు అందించాడు.

పాఠం ఆపి నోటీసు చదివిన అంకబాబు ఆనందానికి అవధులులేవు. ఉత్సాహం పట్టలేక అది క్లాసురూం అన్న విషయం కూడా మరచిపోయి "యాహూ...." అని ఉత్సాహంగా అరిచి ఆ నోటీసుని పదేపదే ముద్దులతో నింపేసాడు.

ఆ చేష్టలు చూసి విద్యార్థులంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కొందరైతే భయంతో బయటకి పారిపోయారు.

ఆనక ఆ నోటీసు చదువుతూ "డియర్ స్టూడెంట్స్...రేపు అక్టోబర్ రెండో తేదీ, ఆదివారం. గాంధీ జయంతి సందర్భంగా కాలేజీకి సెలవు" అని గాల్లోకి తేలిపోతూ ఎంతో సంతోషంగా చదివి వినిపించాడు.

'ఆదివారం సెలవు కావాలి' అన్న చిరకాల కోరికను తీర్చిన ఆ మహాత్మునికి కృతజ్ఞతలు తెలుపుతూ 'పూజ్య బాపూజీ! నీవంటి మహనీయులు మళ్లీ మళ్లీ పుట్టాలి. అలాగే నీ పుట్టినరోజు ప్రతి ఏటా ఇలా ఆదివారం నాడే రావాలి' అని మనసులోనే నివాళులర్పించి తన మొర ఆలకించి సెలవు ప్రసాదించిన ఆ కలియుగ దైవానికి భక్తితో నమస్కరిస్తూ త్వరలోనే తన మొక్కును తీర్చుకుంటాను అని ఆనందంతో కన్నీళ్లు తుడుచుకున్నాడు.

★



## నన్నేమీ అడక్కండి...!

తమిళంలో 'పోకిరి' (తెలుగు పోకిరికి రీమేక్) హిట్టయ్యాక అసిన్‌కు మరింత క్రేజ్ పెరిగింది. ఈ విజయంతో తన రెమ్యునరేషన్‌ని అమాంతం పెంచేసిందిట. ఇప్పుడు అశిన్ బాలీవుడ్‌లోకి 'హిందీ గజిని' ద్వారా అడుగుపెడుతోంది. ప్రెస్‌కి దూరంగా వుంటూ, పారితోషికాన్ని బాగా డిమాండ్ చేస్తూ, ఏమడిగినా 'మా నాన్నని అడగండి' అంటూ తప్పించుకుంటూ మాట్లాడుతోన్న అశిన్ తీరుకు సినీజనాలంతా ఆశ్చర్యంతో ముక్కున వేలేసుకుంటున్నారట.

